క్లుప్తంగా...

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సీశాట్-2024 పరీక్ష ఉచిత శిక్షణ కోసం మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో సుమారు 100 మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయింస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తి, అర్హులుగల అభ్యర్థులు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా లంకల రవికుమార్



అబిడ్స్: అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా లంకల రవికుమార్ నియమితులయ్యారు. గత కొంత కాలం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసవర్మ హైదరాబాద్ సిటీ ఐటీ సెల్‌కు బదిలీ కావడంతో గోషామహల్ ట్రాఫిక్‌లో పనిచేస్తూ పదోన్నతి పొందిన లంకల రవికుమార్‌ను నూతనంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ నియమించారు. గతంలో ఉప్పల్, సరూర్‌నగర్, కీసర, సైదాబాద్ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ఈ సందర్భంగా లంకల రవికుమార్ మాట్లాడుతూ.... ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పూర్తిగా పాటించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


టి.నర్సింహారాజు

అబిడ్స్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని అబిడ్స్ పోలీస్‌స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ టి.నర్సింహారాజు పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలకు పైగా ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజును నగర పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్ నియమించారు. పదవీబాధ్యతలు స్వీకరించిన నర్సింహారాజు గతంలో పంజగుట్ట, చిలకలగూడ, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. స్థానిక ప్రజలు, మైత్రి సభ్యులు, బస్తీ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు.

రూ. లక్ష చేయూత కోసం దరఖాస్తులు

సాక్షి,సిటీ బ్యూరో: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకం కింద వంద శాతం సబ్సిడీతో కూడిన రూ. లక్ష ఆర్థిక చేయూత కోసం అర్హులైన క్రిస్టియన్ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మహ్మద్ ఇలియాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల వరకు వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు.

తెలంగాణలో అవినీతి పాలన


మాట్లాడుతున్న బీజేపీ నేత దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో అవినీతి పాలన సాగుతుందని బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అంటే ప్రజలు అసహ్యించుకుంటున్నారని లెక్కలేనన్ని స్కామ్‌లతో ప్రజలు విసిగి బేజారిపోయారని ఆయన అన్నారు. కార్యక్రమంలో నామ యాదగిరినేత తదితరులున్నారు.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాకర్స్‌కు నో ఎంట్రీ

నాంపల్లి: రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో పబ్లిక్‌గార్డెన్స్ (భాగ్-ఎ-ఆమ్)లోనికి వాకర్స్‌ను అనుమతించలేదు. ఉదయాన్నే వాకింగ్ కోసం వచ్చిన వాకర్స్ తిరుగుముఖం పట్టారు. పోలీసులు ఎవరినీ లోనికి అనుమతించకపోవడంతో వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రకటన జారీ చేయకుండా వాకర్స్‌ను అడ్డుకోవడం సరి కాదని వాపోతున్నారు. శాసన సభ సమావేశంలో ప్రారంభం కావడంతో వీరంతా వెనక్కి వెళ్లాల్సి వచ్చింది.

అపరిశుభ్రం.. కలెక్టరేట్ ప్రాంగణం


సెల్లార్‌లో నిలిచిన వరద నీరు

నాంపల్లి: హైదరాబాదు జిల్లా కలెక్టరేట్‌లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. ఇటీవల హైదరాబాదు జిల్లా కలెక్టరేట్ నాంపల్లి స్టేషన్ రోడ్డు నుంచి లక్డీకాపూల్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోనికి మార్చారు. జిల్లా స్థాయి అధికారులు కొలువుదీరిన చోటే ఇలాంటి సమస్యలు ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. స్నేహ జూబ్లీహాలు పరిసరాలు చాలా దయనీయంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్రత పేరుకుపోయింది. భవన సముదాయం సెల్లార్‌లో ఇంకా వరద నీరు నిలిచిపోయింది. వివిధ రకాల పనుల మీద కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇక్కడి పరిసరాలను చూసి అవాక్కవుతున్నారు. సెల్లార్‌లో పాడుబడిన వాహనాలు, దుర్గంధంలో శౌచాలయాలు, బూజుపట్టిన ఫైళ్లు, పనిచేయని లిఫ్టులు, రోజువారి చెత్తను ఊడ్చకపోవడం వంటి సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం : ఎమ్మెల్యే కౌసర్


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్


పిల్లలకు ట్యాబ్లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ తదితర డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి నిత్యం తాను టోలిచౌకీ మిరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని అన్నారు. అంతే కాకుండా బస్తీలలో పర్యటించి స్థానికులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. జలమండలి అధికారులు, బల్దియా సిబ్బంది, నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

పిల్లలందరికీ అల్బెండాజోల్

గోల్కొండ: పిల్లలందరికి నులి పురుగుల నివారణ ట్యాబ్లెట్లు అందించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన ట్యాబ్లెట్లు అందజేశారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి


కాంగ్రెస్ నాయకుల సమావేశం దృశ్యం

గోల్కొండ: మణిపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణ అన్నారు. గురువారం కార్వాన్ బంజావాడిలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారం, దౌర్జన్యాలు మానవత్వానికే మచ్చగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. మణిపూర్‌లో మహిళలపై దౌర్జన్యాలు జరుగుతుంటే మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ విషయంపై మాట్లాడకుండా అంతర్జాతీయ విషయాలపై మాట్లాడడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. మరోవైపు మణిపూర్ సంఘటనలపై ఇతర దేశాలలో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. మహిళలకు అత్యున్నత గౌరవం ఇచ్చే మన దేశంలో మహిళలను నగ్నంగా ఊరేగించడంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, అహ్మద్ ఖాన్, రవీందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం

గోల్కొండ: గొల్కొండ ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజార్ ఉల్లా అన్నారు. గురువారం ఆసుపత్రిలో పీఎంఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వైద్యులు, ఇతర సిబ్బంది సమష్టి కృషి వల్లే గోల్కొండ ఏరియా ఆసుపత్రికి మంచి పేరు వచ్చిందన్నారు. దీనికి తోడు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కూడా ఆసుపత్రి అభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నారన్నారు. గతంలో కంటే ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగిందని అన్నారు. ఆసుపత్రి ఔట్ పేషంట్స్ రిజిస్ట్రేషన్ కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఇన్ పేషంట్ల సంఖ్య కూడా అందుబాటులో ఉన్న బెడ్‌లకు సరిపోయే విధంగా ఉన్నాయన్నారు. ఆసుపత్రిలో డయాలసిస్ విభాగం కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంవో ఖాజా రాహపుద్దీన్, ఏఈవో శ్రీనివాస్‌రావు, గైనకాలజిస్టు తస్నీమ్‌మెహర్ తదితరులున్నారు.

కార్గిల్ వీర జవాన్లను స్మరించుకోవడం అందరి బాధ్యత

వీర జవాన్లను స్మరించుకోవడం అందరి బాధ్యత



సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

చాంద్రాయణగుట్ట: కార్గిల్ యుద్ధ వీర జవాన్లను స్మరించుకోవడం అందరి బాధ్యత అని జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని అలియాబాద్‌లోని శారద విద్యాలయలో గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కార్గిల్ విజయ్ దివస్ దేశం యొక్క సైనిక పరాక్రమాన్ని, దేశాన్ని సురక్షితంగా ఉంచుతూ మన సాయుధ బలగాలు చేసే గొప్ప త్యాగాలను ప్రజలు గుర్తుంచుకుంటారని తెలిపారు. మేజర్ శివ ప్రసాద్, విద్యావేత్త ప్రభాకర్ రావు, సిటీజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ నారాయణ ముదిరాజ్ పాల్గొన్నారు.

మెట్రో రైల్ పనులు ప్రారంభించకపోతే ఉద్యమిస్తాం


మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డితో సమావేశమైన బీజేపీ నాయకులు

గౌలిపురా: గత ఎన్నికల ముందు పాతబస్తీలో మెట్రో రైలు పనులు ప్రారంభమవుతాయని.. ఎలాగైతే హడావిడి జరిగిందో అదే హడావిడి ఈ ఎన్నికల ముందు కూడా ప్రభుత్వం చేస్తున్నట్లు కనిపిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ అన్నారు. గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్ రెడ్డి, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ తదితరులతో కలిసి మెట్రో ఎండీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాతబస్తీలో ఈసారైనా పనులు ప్రారంభించాలని.. లేదంటే పెద్ద ఎత్తున పాతబస్తీ మెట్రో కోసం బీజేపీ పార్టీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేశ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు తాగేందుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం


మహబూబ్ (ఫైల్)

చాంద్రాయణగుట్ట: కల్లు తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజు గురువారం తెలిపిన మేరకు.. వట్టేపల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ మహబూబ్(60) తరచూ కల్లు తాగుతుంటాడు. ఈ క్రమంలో జూన్ 20న ఉదయం 10 గంటలకు కల్లు కంపౌండ్‌కు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బీఆర్ఎస్‌నేత



అబిడ్స్: రాష్ట్రమంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ కలిశారు. గురువారం అసెంబ్లీ వద్ద మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మెట్రోరైల్ విస్తరణతో పాటు ఆర్టీసీకి చెందిన 43 వేల మంది కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవడంతో ఆయన మంత్రికి అభినందనలు చెప్పారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి 18 రోజుల జైలు

డబీర్‌పురా: అనుమానాస్పదంగా తిరుగుతున్న కేసులో ఓ వ్యక్తికి గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు 18 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన మేరకు.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాలడేరా ప్రాంతంలో ఈ నెల 2న 12 గంటల సమయంలో సయ్యద్ మహమ్మద్ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గౌతమ్ సయ్యద్ మహమ్మద్ ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడు. దీంతో పోలీసులు మహమ్మద్‌పై ఈ-పెట్టి కేసులు నమోదు చేశారు. అనంతరం మహమ్మద్‌ను పోలీసులు గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా... మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు మహమ్మద్‌కు 18 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సెల్‌ఫోన్‌ను లాక్కున్న కేసులో నిందితునికి రిమాండ్

గౌలిపురా: ఓ ఆటో డ్రైవర్‌ను బెదిరించి ఫోన్‌ను లాక్కోవడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన కేసులో భవానీనగర్ పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన మేరకు.. ఈ నెల 2వ తేదీన చార్మినార్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ ముజమిల్ ప్రయాణికుల కోసం వేచి ఉన్నాడు. కాగా అదే సమయంలో సంతోష్‌నగర్ భానునగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ షాహబాజ్ (28) ముజమిల్ ఆటోలో ఎక్కి తనను తలాబ్‌కట్టా రోడ్డు-11లో డ్రాప్ చేయాలని సూచించాడు. దీంతో ముజమిల్ షాహబాజ్‌ను తలాబ్‌కట్టాలో వదిలేసిన అనంతరం ఆటో డబ్బులు ఇవ్వమని కోరగా... షాహబాజ్ ఆటో డబ్బులు ఇవ్వకుండా ముజమిల్‌ను బెదిరించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను దొంగలించాడు. దీనిపై బాధితుడు ఆటో డ్రైవర్ ముజమిల్ భవానీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నిందితుడు షాహబాజ్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించగా... స్టేషన్‌లో పోలీసులతో సైతం దురుసుగా ప్రవర్తించి అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాడు. దీంతో పోలీసులు నిందితుడు షాహబాజ్‌పై కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు షాహబాజ్‌పై గతంలో చాంద్రాయణగుట్ట, పహడీషరీఫ్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్లలో సైతం కేసులు నమోదై ఉన్నాయి.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలో గుట్టుచప్పుడు కాకుండా మూడు ముక్కలాట ఆడుతున్న ఎనిమిది మందిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఫలక్‌నుమాలో బుధవారం రాత్రి ఎనిమిది మంది వ్యక్తులు పేకాట ఆడుతున్న విషయమై విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 104 కార్డులు, రూ.17,840ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించారు.



నులిపురుగుల నివారణపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అంజిలా ఆల్ఫ్రెడ్, తదితరులు


విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు జి.శంకరయ్య

యాకుత్‌పురా: ప్రభుత్వ ఆదేశాల మేరకు నులిపురుగుల నివారణకు ఈనెల 1 నుంచి 19 లోపు మాత్రలు పంపిణీ చేసి అవసరమైన అంశాలను వివరించామని వైద్య విధాన పరిషత్ డబీర్‌పురా క్లస్టర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అంజిలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం డబీర్‌పురా క్లస్టర్ పరిధిలోని యాకుత్‌పురా-1,2, డబీర్‌పురా, అంజంపురా, దారుషిఫా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మొదటి విడతలో మాత్రలు వేయించుకోని చిన్నారులకు ఈ నెల 10వ తేదీన తిరిగి మాత్రలు పంపిణీ చేయనున్నామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మజ్లీస్ పార్టీ నాయకులు షాఫహత్ ఆలీ, యాకుత్‌పురా -1 ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయోషా ముద్దాషిర్, పారామెడికల్ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

విజయనగర్‌కాలనీ: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అఫ్జల్‌సాగర్ పట్టణ వైద్యశాల ఆధ్వర్యంలో విజయనగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాజు, ఏఎన్ఎంలు శారద దేవి, ప్రేమలత, విజయలతో పాటు ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ

చార్మినార్: జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం దారుషిఫాలోని అంధుల పాఠశాలలో పురానీహవేలి దూద్‌ఖానా ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ నమిలే మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి పాల్గొని విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు.

గోషామహల్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి


ధూల్‌పేట్‌లో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తీర్మానం చేశారు. గురువారం ధూల్‌పేటలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గో కరణ్‌సింగ్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మధుసుధన్ గుప్తా, దండ అశోక్, నిర్మల్‌కుమార్ యాదవ్, సికె.మూర్తి, కన్నెలాల్ యాదవ్, శ్యామ్‌సింగ్, జితేందర్ సింగ్, అనిల్ సింగ్, సంజయ్ యాదవ్, రామ్‌రాజ్‌సింగ్, నరేందర్‌లతో పాటు పలువురు నాయకులు సమావేశమయ్యారు. గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు అడ్డా అని వారన్నారు. ఈ ఎన్నికల్లో స్థానికులకు మాత్రమే టికెట్టు ఇవ్వాలని, ఇతర పార్టీల నుంచి ఎవరైనా వస్తే వారికి టికెటు మాత్రం ఇవ్వవద్దని తీర్మానం చేశారు.

కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం

చాంద్రాయణగుట్ట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ బార్కాస్ డివిజన్ సీనియర్ నాయకురాలు చెన్నయ్యగారి సరిత అన్నారు. రైతుల రుణమాఫీ చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్న సందర్భంగా గురువారం ఆమె సమీపంలోని మామిడిపల్లి గ్రామ రైతులతో కలిసి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. దేశంలోనే రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రిగా కేసీఆర్ అగ్రస్థానంలో నిలుస్తారన్నారు.


కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న సరిత, రైతులు

గోల్కొండ ఏసీపీగా సయ్యద్ ఫయాజ్


సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఫ్రెండ్లీ పోలీసింగ్ వల్ల మంచి ఫలితాలు వచ్చాయని గోల్కొండ ఏసీపీ సయ్యద్‌ఫయాజ్ అన్నారు. గురువారం గోల్కొండ ఏసీపీగా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా గతంలో తాను పని చేశానని తిరిగి ఇదే ప్రాంతానికి ఏసీపీగా రావడం తన అదృష్టమని ఆయన అన్నారు. కార్యక్రమంలో గొల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటి చైర్మన్ ఎస్.రాజువస్తాద్ తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూల దృక్పథం


సభలో ప్రసంగిస్తున్న సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ అన్నారు. టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఉద్యోగుల సమస్యల పరిష్కార సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మామిళ్ల రాజేందర్ హాజరై ప్రసంగించారు. టీఎన్జీఓ సంఘంలో ప్రాథమిక సభ్యులుగా ఉన్న ఉద్యోగిపై ఈగ వాలినా సహించేది లేదన్నారు. అధికారులు ఉద్యోగులను వేధిస్తే ఊరుకునేది లేదన్నారు. వారి గౌరవాన్ని వారు కాపాడుకోవాలని హెచ్చరించారు. ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. వీఆర్‌ఓ ఉద్యోగులను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసేలా టీఎన్జీఓ కృషి ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ పాల్గొన్నారు.

నగల యజమానిని మోసం చేసిన కేసులో నిందితునికి రిమాండ్


వివరాలను వెల్లడిస్తున్న చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్

దూద్‌బౌలి: పని చేస్తున్న దుకాణ యజమానిని మోసం చేసి బంగారు నగలతో పరారైన నిందితున్ని హుస్సేనీఆలం పోలీసులు గురువారం చాకచాక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 38 తులాల బంగారు కడ్డీని స్వాధీనం చేసుకున్నారు. గురువారం చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ వీరభద్ర కుమార్‌లతో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన తారక్‌నాథ్ బేరా బంగారు ఆభరణాలు తయారు చేస్తుంటాడు. ఇతని వద్ద నుంచి కొన్ని రోజుల క్రితం పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన ఖికాన్ మజీహా అలియాస్ సిరాజ్ (35) బంగారు నగలను మెరుగు దిద్దడానికి పనిలో చేరి యజమానిని పూర్తిగా నమ్మించాడు. ఇందులో భాగంగా గత నెల 27వ తేదీన 55 తులాల బంగారు నగలకు మెరుగులు దిద్దడానికి సిరాజ్‌కు అప్పగించాడు. దీంతో సిరాజ్ ఆ నగలను తీసుకొని రైలులో విశాఖపట్నంకు పరారయ్యాడు. ఎంతకీ సిరాజ్ కనిపించకపోవడంతో బంగారు నగల యజమాని తారక్‌నాథ్ బేరా హుస్సేనీఆలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హుస్సేనీఆలం పోలీసులు కేసు నమోదు చేసుకొని సాంకేతిక ఆధారాల ద్వారా విశాఖపట్నంలో ఉన్నట్లు తెలుసుకొని అక్కడికి పోలీసులకు సమాచారం అందించగా... విశాఖపట్నం పోలీసులు సిరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అప్పటికే బంగారు నగలను కరిగించి కడ్డీ రూపంలో మార్చారు. ఇక్కడి నుంచి విశాఖపట్నంకు చేరుకున్న హుస్సేనీఆలం ప్రత్యేక పోలీసు బృందం సిరాజ్‌ను అదుపులోకి తీసుకొని అక్కడ కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిస్ట్ వారెంట్ అందించి నగరానికి తీసుకొచ్చారు. అతని వద్ద నుంచి 38 తులాల బంగారు కడ్డీతో పాటు కరిగించడానికి ఉపయోగించిన గ్యాస్ కట్టర్, ఎయిర్‌గన్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చాకచాక్యంగా వ్యవహరించిన అదనపు ఇన్‌స్పెక్టర్ వీరభద్ర కుమార్, ఎస్సై నవీన్, కానిస్టేబుళ్లు సందీప్, శ్రీనివాస్ చారి, మురళీలను ఏసీపీ రుద్ర భాస్కర్ రివార్డులతో ప్రత్యేకంగా అభినందించారు.